# దిగాలు మొగాలు

కె. వి. సూర్యనారాయణ

★

లాభాలు తిని భోజనాలు మానేసినట్టున్నారు బొజ్జంతా తీసేసింది. మా కోసం పడి ఏడుస్తోంటే మీ పని అయింది. రేపు పద్దెనిమిది మంచి మీ పని అంతే? చొక్కా మీకూ ఒదులై పోయింది.

అదేమిటండోయ్ మేం న్యాయంగా బతికే వాళ్ళం!

మేమే కాబోలు అన్యాయంగా బతికేవాళ్ళం. మా అబ్బాయి పెళ్ళికి గ్లాస్కో-పంచి పదిరూపాయలు చేసి మీదెగ్గిర పట్టుకెళ్ళలేదండీ?

మా అమ్మాయి శోభనానికి కుంచం మూడు రూపాయలుచేసి తమదెగ్గిరేగా ఖరీదుచేస్తా!

అందులో నాకేమైనా మిగిలివచ్చిందా? కొట్టులో గుమస్తాకియ్యాలి, కొలిచిన కుఱ్ఱాడికియ్యాలి, బెదిరించిన ఇనస్పెక్టరు కివ్వాలి. అడిగిన ఆఫీసరుకి పంపించాలి.

మాకేకాబోలు మిగుల్తె. మా బాబులు మా కున్నారు. ఇనస్పెక్టరుగారింట పెళ్లికి పదిచీరలు పంపించా. ఎక్సైజ్ ఆఫీసరుగారు కబురెట్టితే 50 గజాల సూటుగుడ్డ పంపించా. ఏం లాభాలండి కాకుల్ని కొట్టి గద్దలకు వేయడమేగా?

అయితే రెండు మేడలు ఆరుఎకరాల భూమీ కొన్నావా ఈ రెండు ఏళ్ళల్లోనూ?

మీలో ఎన్నోవంతు! మీరంతా ఏభైఎకరాల వల్లమట్టి చేసి పడేశారు.

చాల్లే దాన్లోకాని అన్యాయంగా మింగితే అబ్బతోడు.

అన్యాయంగా మింగారన్నానా? అన్నాతురులకి భోజనం పెట్టారన్నాగాని. అయినా పోయిన అబ్బ తిరిగి వస్తాడా?

వీకేమోయి ఇంకా పని వుంది. మా దర్జా అంతా పోయింది. ఎంతమంది కొట్టుచుట్టు ఇంటి చుట్టు పడగాపులు పడి కూర్చొనేవారు.

పాపం! అదంతా పూర్వసువాసినత్వం అయి పోయిందిప్పుడు. నీ మొసలికన్నీళ్ళకేం గాని నిజంగా ఎంతలాభం వచ్చిందో చెప్పు?

మీ లాభం చెప్పండి?

మా లాభాలకెంతోయ్ గింజకి రెండుగింజలు మిగిలేను, మూడు గింజలు మిగిలేను. అంతేనా?

అరి మీ తస్సాదియ్యా 300°/₀ లాభమే?

ఆ లెక్కలేం మాకు తెలవదు. కుంచం రూపాయకి బతిమాలితే కొనటంలేదు. వెధవమార్కెట్టు. నీ సంగతి చెప్పావుకాదు.

మాదీ ఓ లాభమే నేమిటి. ఏదోస్వల్పలాభం తానుకోఏభై రూపాయలు చీటీమీద మిగిలేవి?

చీటీమీదే అంత లాభమా? అమ్మల్లో! మా వర్తక మేం వర్తకమయ్యా, మీదే రాజావర్తకం.

ఇప్పుడు మనిద్దరినీ చూసేవాళ్లు లేరుకా?

చూడకేం. ఏమిటి గూడుపుటాణీ పెడుతున్నారు.

అబ్బో! సురాభాండేశ్వరరావుగారు, ఆఫీసరు గారూ దండాలండి! ఏమిటి బాబయ్యా గవర్నమెంటు మన నోట్లో యిల్లా మట్టికొట్టింది. మీరూ దిగాలుబడి వున్నారు.

అవునయ్యా కంట్రోళ్లన్నీతీసేసి ప్రజోపకారం చేస్తున్నారూ.

చిత్తం చిత్తం తెలిసిందండి!

చూశావూ! మంచి బియ్యం కొట్టులో వున్నాయా?

నా కొట్టులోనేమిటండీ బజారంతా మంచి బియ్యం తెప్పిస్తున్నారు. కిచిలీసాంబారు—కృష్ణ కాటుకలు—ఢిల్లీభోగాలు, బంగారు తీగెలు....

చాల్లే! పరధ్యానంగా వున్నా....కంట్రోలు తీసేశారు కాదూ.

అది తీసేశాక మాకు పరధ్యానంగానే వుందండీ: తమరు కొత్తగా కట్టిన మేడలో గృహప్రవేశమెప్పుడండీ? మంచి ఫక్కీలో కట్టించారు. కుబేరుడి ఇల్లులా వుంది....అన్నట్టు గృహప్రవేశానికి బట్టలు కావాలోయ్....చిత్తం, నౌకరు చేతికి ఇస్తాలెండి.

డబ్బు పంపిస్తా. మంచిచీరలు అవీ పంపించు. నే వెళ్లొస్తా....ఆఫీసరుగారు వెళ్ళిపోశారు.

డబ్బు పంపించకుండా యివ్వడానికి పాత రోజులు కావు బాబూ అనుకుంటాడు.